క్లుప్తంగా

రూ.25 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట శ్మశానవాటికలో రూ.25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఇరవై ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటికలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో వసతులు కల్పించనున్నారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, పీతల వెంకట అప్పారావు, చిల్ల సూర్యనారాయణ రెడ్డి, కంచుబోయిన వెంకటరావు, నమమి మాధవ, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల ప్రమీల, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, మద్ది లక్ష్మి, చిల్ల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన బడ్డీల తొలగింపు



పీఎం పాలెం ఆఖరి బస్టాపు సమీపంలో బడ్డీ తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పీఎం పాలెం : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు సమీపంలో రోడ్డు స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను పొక్లెయిన్‌తో బుధవారం తొలగించారు. ఇటీవల కొంతమంది అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ అధికారులు స్పందించారు. పొక్లెయిన్‌తో బడ్డీల తొలగింపునకు చర్యలు చేపట్టారు. రోడ్డును ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా, బడ్డీలు పెట్టినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కనక మహాలక్ష్మి హెచ్చరించారు.

అనంతుని పవిత్రోత్సవాలకు అంకురార్పన



కుంతీ మాధవ స్వామి ఆలయంలో విశ్వక్షేన పూజ చేస్తున్న అర్చకులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 11 వరకు జరగనున్న అనంతుని పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పన చేశారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో చక్ర పెరుమాళ్ల విగ్రహం వద్ద విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి చక్ర పెరుమాళ్లను కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి సంత నిర్వహించే పాత స్థలం వద్దకు పల్లకీలో తీసుకొచ్చి పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో చిప్పాడ సుత్తమ్మతల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయానికి బుధవారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారిని చిప్పాడ నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్వయుజ మాస చివరి బుధవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

చురుగ్గా పెద్ద చెరువు ప్రక్షాళన పనులు

అవుట్‌లెట్లు తెరవడంపై ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు



చిట్టివలస పెద్ద చెరువులో జేసీబీతో పూడికతీత పనులు నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువులో రెండు రోజులుగా జేసీబీతో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల భీమిలి రోడ్డు చిల్లపేట, జీరుపేట గ్రామాల వైపు దుర్వాసన రావడంతో ఆ గ్రామాల వారు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికి రెండు సార్లు అధికారులు చెరువు వద్ద సమావేశమైనా ఏకాభిప్రాయానికి రాలేకపోయినట్టు తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు, మత్స్యకారులు, స్థానిక ప్రజలు, రైతులు పరస్పరం విరుద్ధమైన అభిప్రాయాలు వెల్లడిస్తున్నారు. చిట్టివలస సర్వే నంబర్ 24లో 36.40 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని శిలాఫలకం వేసి రూ.1.92 కోట్ల విలువైన పనులు మధ్యలో వదిలేసి చేతులు ఎత్తేసింది. దీంతో ఈ నిధులు చెరువులో పోసినట్టు అయింది. ఈ ఏడాది జూన్‌లో చెరువులో రూ.6.50 కోట్లతో బ్యూటిఫికేషన్ పనుల నిమిత్తం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలాఫలకం వేశారు.

చెరువు నుంచి దుర్వాసనతో ఆరోపణలు

ఇటీవల చెరువు నుంచి దుర్వాసన కారణంగా ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సంతపేట, నమ్మివానిపేట గ్రామాలతోపాటు సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వ్యర్థాలు చెరువులో కలుస్తున్నాయంటూ ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. మరోవైపు సాంప్రదాయ మత్స్యకారులు తమపై వచ్చిన ఆరోపణలు తిప్పికొట్టేందుకు చెరువులోని తామరతూడును సమూలంగా తొలగించారు. ఇక చెరువు అవుట్‌లెట్లు తెరవడంపై ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య బేధాభిప్రాయాలు వెలుగు చూస్తున్నాయి. చెరువు అవుట్‌లెట్ల నుంచి నీటిని వ్యవసాయ భూములకు మళ్లించొద్దని, బొగ్గురోడ్డు సుఖీభవ కాలనీలో అవుట్‌లెట్లను మూసి వేసిందని, చెరువుకు అభిముఖంగా మరో డ్రైనేజీ నిర్మించి మురుగునీరు చెరువులో కలవకుండా నేరుగా సముద్రంలోకి మళ్లించాలని సలహాలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా చెరువును ఆనుకుని సర్వే నంబర్ 24లో తమ వ్యవసాయ భూములు ఉన్నాయని ఒక వర్గం వాదిస్తుండగా, మరో వర్గం చెరువులో ఆక్రమణలు ఉన్నాయని, వాటిని తొలగించి చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పక్కాగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ లక్ష్మణరావు

తగరపువలస : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం గురువారం నుంచి భీమిలి మండలం అమనాం పంచాయతీలో ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించనున్నారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాలకు సంబంధించి 10 సచివాలయాల షెడ్యూల్‌ను మండల పరిషత్ అధికారులు బుధవారం విడుదల చేశారు. 10న అన్నవరం, 14న చిప్పాడ, 15న దాకమర్రి, 16న లక్ష్మీపురం, 17న మజ్జిపేట, 20న మజ్జివలస, 21న మూలకుద్దు, 22న పెదనాగమయ్యపాలెం, 23న శింగనబంద పంచాయతీల్లో జరుగుతుంది.

పద్మనాభం : మండలంలో గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. 9న అనంతవరంలో, 10న ఐనాడ, 14న బీఆర్ తాళ్లవలస, 15న బాందేవుపురం, 16న గంధవరం, 17న కోరాడ, 20న కొవ్వాడ, 21న కృష్ణాపురం, 22న మద్ది, 23న నేరెళ్లవలస గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఈవోఆర్డీ కుమార్ పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో'వై ఏపీ నీడ్స్' జగన్

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం జరగనుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని బంక సత్యం కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ మూర్తి కోరారు. ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విమ్స్ ఆవరణలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. మరోవైపు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు తెరవకూడదన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు వారిని కనిపెడుతుండాలని ఆయన సూచించారు. విశాఖ ఏజెన్సీతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి గంజాయి సరఫరా అవుతుందన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనచోదకులు, యూనియన్ నాయకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సదస్సులో ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజినీర్ కరీం, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి రవికుమార్, పాఠశాల విద్యార్థులు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కుంతీ మాధవ స్వామి హుండీ ఆదాయం రూ.84 వేలు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఐదు హుండీల ద్వారా ఆదాయం రూ.84,973 వచ్చింది. 2022 నవంబర్ 30 నుంచి 2023 నవంబర్ ఎనిమిది వరకు ఐదు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈవో నానాజీబాబు సమక్షంలో హుండీలు లెక్కించారు.

విద్యాసంస్థల బంద్ పాక్షికం

తగరపువలస: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం విద్యాసంస్థల బంద్ పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ విద్యాసంస్థలు పాక్షికంగా మూతపడగా ప్రైవేట్ విద్యాసంస్థలు యధావిధిగా తెరచుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు కె.తేజశ్రీ, టి.ఝాన్సీ లక్ష్మి, వాసు, హేమంత్, శ్రీనివాసవర్మ, గుజ్జు సూరిబాబు, ఉప్పాడ ప్రవీణ్ తదితరులు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరించకుండా రక్షించాలని కోరారు.

హెచ్చరిక బోర్డున్నా ప్రభుత్వ భూమిలో రోడ్డు



పరదేశిపాలెంలో హెచ్చరిక బోర్డు పక్కకు జరిపి నిర్మించిన రోడ్డు

మధురవాడ: కొంత మంది ఆక్రమార్కులు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను కూడా ఖాతరు చేయడం లేదు. బోర్డు ఉంటే మాకేంటి అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 32నే ఒక నిదర్శనం. జాతీయ రహదారిని ఆనుకుని విలువైన ప్రభుత్వ భూమిలో నుంచి ఓ వ్యక్తి తన స్థలంలోకి రాకపోకలు కోసం గ్రావెల్ వేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం గమనించి నెల రోజుల క్రితం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు గడిచాక ఆ బోర్డునే కాస్త పక్కకు జరిపి కలెక్టర్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు పక్క నుంచి రోడ్డు ఏర్పాటు చేసి రాకపోకలు కానిచ్చేస్తున్నారు. ఈ తంతు కొద్దిరోజులుగా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అసలు బోర్డు ఎందుకు ఏర్పాటు చేశారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దొంగతనం చేసిన యువకుడికి ఆరు నెలల జైలు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలో దొంగతనానికి పాల్పడిన యువకుడికి ఆరు నెలల జైలు, రూ.వేయి జరిమానా విధిస్తూ భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి విజయలక్ష్మి తీర్పునిచ్చారు. ఆనందపురం క్రైం ఎస్‌ఐ మన్మథరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 1న శొంఠ్యాం గ్రామంలో గల అభయాంజనేయ స్వామి గుడిలో దొంగతనం జరిగింది. ఈ మేరకు బొద్దపు సంతోష్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు నగరంలోని గవర కంచరపాలెం మెట్ట ప్రాంతానికి చెందిన వద్దే మోషే (21)ను నిందితుడిగా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన న్యాయమూర్తి విజయలక్ష్మి వద్దే మోషేను ముద్దాయిగా నిర్ధారిస్తూ పైవిధంగా తీర్పునిచ్చారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

తగరపువలస: తగరపువలస ప్రెస్‌క్లబ్ సమావేశం బుధవారం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షునిగా డి.జె.మోహన్‌కుమార్, ఉపాధ్యక్షునిగా జయంత్, ప్రధాన కార్యదర్శిగా గణపతిరావు, సహాయ కార్యదర్శిగా రోజా, కోశాధికారిగా బోని ఈశ్వర్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎ.త్రిమూర్తులు, బోని ఆదిరాజు, బి.అప్పలరెడ్డి, కిమిడి చిరంజీవిరావు, జయ సూర్యలను ఎన్నుకున్నారు. సలహాదారునిగా సీనియర్ రిపోర్టర్ పి.రంగధామారావు నియమితులయ్యారు.

ఫుట్‌పాత్‌లపై అడ్డదిడ్డంగా సిమెంట్ పలకలు



తాళ్లవలస ఒడిశా దాబా వద్ద పలకల దుస్థితి



గొల్లల తాళ్లవలస ఆంజనేయస్వామి ఆలయం వద్ద సిమెంట్ పలక దుస్థితి



తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం వద్ద డ్రైనేజీపై విరిగిన పలక

వాటిపై నడిచి వెళ్లేందుకు భయపడుతున్న పాదచారులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లను ఆనుకుని ఉన్న డ్రైనేజీల ఫుట్‌పాత్‌లపై సిమెంట్ పలకలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. డ్రైనేజీలపై అడ్డదిడ్డంగా చాలా వరకు పలకలు దర్శనమిస్తుండగా, శిథిలమైనవి కొన్ని, విరిగి అందులో పడిపోయినవి మరికొన్ని కనిపిస్తున్నాయి. దీంతో ఫుట్‌పాత్‌ల మీదుగా నడవాలంటేనే పలువురు భయాందోళనకు గురవుతున్నారు. వీటిపై నడిచేటప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే కాళ్లు విరగడం ఖాయమని వెనుకడుగు వేస్తున్నారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో డ్రైనేజీల్లో వర్షం నీరు ప్రవహించడానికి వీటిపై వేసిన సిమెంట్ పలకలు నడవడానికి అనువుగా నిర్మించారు. తర్వాత వీటి ఉపయోగం గురించి మరచిపోయారు. నిర్మాణ సమయంలోనే డ్రైనేజీలకు వినియోగించిన శ్లాబ్ మెటీరియల్ తొలగించకపోవడంతో వర్షం నీరు రహదారులపై నిలిచిపోతోంది. ప్రస్తుతం శిథిలమైన పలకల కారణంగా ఫుట్‌పాత్‌లపై నడవలేక పలువురు సర్వీస్‌రోడ్లను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి వెంట వాకింగ్ చేసే వారు ఫుట్‌పాత్‌లను ఎంచుకుంటారు. కానీ తాళ్లవలస పంచాయతీలో ఫుట్‌పాత్‌లపై అడుగుకో సిమెంట్ పలక శిథిలం కావడంతో చాలా వరకు వాకింగ్‌కు వెనుదిరుగుతున్నారు. బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని హైవే సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తీయించి, సిమెంట్ పలకలు సరిచేసి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరుతున్నారు.

పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: ఓటరు జాబితాలో పొరపాట్లు, క్రమరాహిత్యాలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని, ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధి ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో అక్కయ్యపాలెం షాదీఖానాలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా.. బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. అన్ని వివరాలు సరిపోయిన తరువాతే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా.. వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని, అనంతరం చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

- 25 నుంచి 22వ పుస్తక మహోత్సవం



పుస్తక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం : విశాలాంధ్ర బుక్ హౌస్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక ప్రదర్శన ప్రచార పోస్టర్‌ను నగర శాంతి భద్రతల డీసీపీ-1 కె. శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బుధవారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రతినిధులు పీపీ రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, సభ్యులు సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, శ్యాంసుందర్ తదితరులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర ప్రచురణ సంస్థలు తెలుగు సాహిత్య విస్తరణకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. పుస్తక మహోత్సవాన్ని పుస్తకప్రియులు, సాహితీవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం



నిత్యాన్నదానం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట (డొంకపేట) రామాలయంలో 41 రోజులపాటు జరగనున్న నిత్యాన్నదానం బుధవారం భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ప్రారంభించారు. ముందుగా చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయ అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ పూజలు నిర్వహించి పీఠం ఏర్పాటు చేశారు. సుమారు 300 మందికిపైగా స్వాములు ఆయన వద్ద దీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు కరుభుక్త ఈశ్వరరావు, గాడు సన్యాసినాయుడు, సురాల సత్యనారాయణ, గాడు అప్పలనాయుడు, బోని ఈశ్వరరావు, కనకల సూర్యరమణ, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, నీలాపు సూర్యనారాయణ, శిరిగుడి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ



ప్రజారక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: విజయవాడలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి జయప్రదానికి సీపీఎం నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. కొమ్మాది కూడలి వద్ద సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు తదితరులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల విధానాల వల్ల కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రజల సమస్యలే అజెండాగా విజయవాడలో భారీ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.రాజ్‌కుమార్, కె.సుజాత, కె.పుష్ప, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్పెంటర్ దుర్మరణం



మృతుడు అప్పలాచారి(ఫైల్)



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, స్థానికులు

ఆరిలోవ: లారీ ఢీకొని ఓ కార్పెంటర్ మృతి చెందిన ఘటన ఓల్డ్ డెయిరీ ఫారం కూడలిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు, మృతుడు బంధువులు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం చేయాలంటూ బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి(36) కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పని చేసుకుని మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై విశాఖ బయలుదేరాడు. జాతీయ రహదారిపై ఓల్డ్ డెయిరీ ఫారం వద్ద ఆరిలోవ వైపు తిరిగే సమయంలో జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొంది. దీంతో అప్పలాచారి కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా లారీ యజమానిని పిలిపించి తమ కుటుంబానికి న్యాయం చేసేలా చూడాలని మృతుడు భార్య, పిల్లలు, బంధువులు, దుర్గానగర్ వాసులు బుధవారం ఆరిలోవ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఫిర్యాదు చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్టలేమని సీఐ సోమశేఖర్ వారికి నచ్చజెప్పారు. చివరకు సాయంత్రం ఈ ప్రమాదంపై మృతుడు భార్య జ్యోతి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ అభినందన



సెక్యూరిటీ గార్డుకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని, నిందితులను పోలీసులకు అప్పగించిన కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునతో పాటు ఆస్పత్రి వైద్యులు అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు కలెక్టర్ జ్ఞాపికను బహూకరించారు. ఈనెల 6న సెక్యూరిటీ గార్డులు అల్లు కుమారస్వామి, రంగాల వినోద్‌కుమార్ కేజీహెచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళల బ్యాగులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ మహిళల బాగుల్లో గంజాయి బయట పడింది. దీంతో ఆ ముగ్గురు మహిళలను సెక్యూరిటీ గార్డులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఈ ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అభినందించారు.